క్లుప్తంగా

షిర్డీసాయికి అభిషేకం

మామిడికుదురు: పెదపట్నంలంక షిర్డీ సాయిబాబా మందిరం ఆరో వార్షికోత్సవంలో భాగంగా సోమవారం పలు ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం కాకడ హారతిని ఘనంగా నిర్వహించారు. సాయిబాబాకు, గణపతి, గురుదత్తాత్రేయులకు సామూహిక పూజ నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్‌కు 54 లీటర్ల చెరకు రసంతో అభిషేకం చేశారు. దీంతో పాటు పంచామృతాలు, పళ్ల రసాలతో అర్చన జరిపించారు. ఈ పూజల్లో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం మందిర ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన పిప్పళ్ళ ప్రసాదరావు బృందం ఆలపించిన శ్రీసాయి సంకీర్తనావళి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మందిరం వద్ద ఏర్పాటు చేసిన విశేష దీపాలంకరణ భక్తులను మంత్రముగ్ధుల్ని చేసింది.

ఉచిత కంటి పరీక్షలు


మామిడికుదురులో నిర్వహిస్తున్న ఉచిత పరీక్షలు

మామిడికుదురు: గ్రామ పంచాయతీ వద్ద సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి చెందిన నిపుణులు జె.మౌనిక, ఆర్.తేజస్విని ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో 41 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఏడుగురు కంటి శుక్లాల సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు పర్యవేక్షించారు.

నేడు, రేపు కాలువలకు సాగునీరు

కొత్తపేట: ప్రస్తుత రబీ (దాళ్వా) పంటకు వంతుల వారీగా సాగునీరు సరఫరా విధానం అమలు చేస్తున్నట్టు ఇరిగేషన్ స్థానిక సెక్షన్ ఏఈ వి.నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ బొబ్బర్లంక–ముక్తేశ్వరం ప్రధాన పంట కాలువ ద్వారా మండలంలోని వాడపాలెం లాకులపై చానల్స్‌కు మంగలవారం సాయంత్రం 6 గంటల నుంచి బుధవారం సాయంత్రం 6 గంటల వరకూ సాగునీరు సరఫరా చేయనున్నట్టు ఏఈ తెలిపారు. ఆయా చానళ్ల కింద కొత్తపేట, వాడపాలెం, బిళ్లకుర్రు గ్రామాల పరిధిలోని వరి ఆయకట్టుకు సంబంధించిన రైతులు వంతుల వారీ విధానంలో తమ భూములకు సాగునీరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా లక్ష బిల్వార్చన

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీతీరం పాశర్లపూడిలంకలో కొలువైన శ్రీవల్లీ, దేవసేన సమేత నాగేంద్రస్వామి ఆలయంలో సోమవారం లక్ష బిల్వార్చన ఘనంగా జరిగింది. స్వామి వారి వార్షిక దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అమ్మ వారికి సహస్ర కుంకుమార్చన పూజలను ఘనంగా జరిపించారు. ఆలయ అర్చకులు గంటి బాలసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ఆదిరాజు నరసింహమూర్తి ఈ పూజలను వైభవంగా జరిపించారు. పలువురు భక్తులు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. ఆదివారం రాత్రి స్వామి వారి దివ్య తిరు కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిపించారు. పలువురు భక్తులు ఈ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

హజరత్ అబ్బాస్ జయంతి

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ అబ్బాస్ జయంతిని సోమవారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. దీనిలో భాగంగా మామిడికుదురులోని హజరత్ అబ్బాస్ పంజాలో మిలాద్ జరిగింది. రిజ్వాన్ హుస్సేన్, నన్నేషా హుస్సేన్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. నగరం గ్రామంలోని మంజిలే కర్బలా పంజాలో కూడా మిలాద్ ఏర్పాటు చేశారు. పలువురు ఉర్దూ కవులు తమ కవిత్వాల ద్వారా హజరత్ అబ్బాస్ ఔన్నత్యాన్ని తెలియజేశారు. మొగలికుదురు మసీదులో కూడా హజరత్ అబ్బాస్ జయంతిని వేడుకగా జరిపారు.


డ్రగ్స్‌తో జీవితాలు నాశనం



సదస్సులో మాట్లాడుతున్న రాజోలు సీఐ నగేష్ కుమార్

మలికిపురం: డ్రగ్స్ తో జీవితాలు నాశనం చేసుకోవద్దని రాజోలు సీఐ టీవీ నగేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో 'డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్'లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఎన్.ఆనందమహాని అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా, రిసోర్స్‌పర్సన్‌గా రాజోలు సీఐ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు దుర్వ్యసనాలకు బానిసలు కాకూడదని, ముఖ్యంగా గంజాయి లాంటి డ్రగ్స్‌కి బానిసలు కాకుండా ఉండాలని పేర్కొన్నారు. క్రమశిక్షణతో చదువుకోవాలని, ఎవరైనా ఈ డ్రగ్స్‌కి బానిసలు అయితే మా దృష్టికి తీసుకురావాలని, వారికి కోర్టులు కఠిన శిక్షలు విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ నక్క రమేష్‌బాబు, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి వాహనానికీ ఓ పరమార్థం

- నేటి నుంచి 13 వరకూ అంతర్వేది కల్యాణోత్సవాలు
- రోజుకో వాహనంపై స్వామి ఊరేగింపు
- పూర్తయిన ఏర్పాట్లు


సూర్యప్రభ వాహనం (ఫైల్)


చంద్రప్రభ వాహనం (ఫైల్)


అంతర్వేదిలో కొలువై ఉన్న స్వామి

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీనృసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో స్వామిని పురవీధుల్లో వివిధ వాహనాలపై ఊరేగిస్తూ గ్రామోత్సవాలను నిర్వహిస్తుంటారు. ఉత్సవాల్లో 14 రకాల వాహనాలపై స్వామికి గ్రామోత్సవం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుందని ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ తెలిపారు. ప్రతి వాహనానికి ఓ పరమార్థం ఉన్నట్టు పురాణ సారాంశం అని అన్నారు. క్షేత్రంలో నేటి నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించనున్న ఉత్సవాల్లో ఈ వాహనాలను వినియోగిస్తారన్నారు. వాహనాలు, వాటి విశిష్టతలు ఇవే..

రథసప్తమి 4వ తేదీ మొదటి రోజున

సూర్యవాహనం: తొలి రోజున సాయంత్రం స్వామి సూర్య వాహనంపై గ్రామంలో భక్తులకు దర్శనమిస్తారు. అజ్ఞానాన్ని పారదోలి, జ్ఞానమనే వెలుగును నింపడమే ఈ వాహనోత్సవ లక్ష్యం.

చంద్రప్రభవాహనం: తొలిరోజు రోజున రాత్రి స్వామి చంద్రప్రభ వాహనంపై గ్రామంలో భక్తులకు దర్శనమిస్తారు. నిర్మలమైన మనస్సును, మనోవికాసాన్ని ఇవ్వడమే ఈ వాహనోత్సవ పరమార్థం.

5వ తేదీ (రెండో రోజు)

గరుడ పుష్పక వాహనం: వేదమూర్తయిన గరుడ స్వామివారి వాహనం. నిత్యం తనను సేవించే గరుడ వాహనంపై అధిరోహించి, స్వామి గ్రామోత్సవానికి తరలివెళతారు.

పుష్పక వాహనం: తన హృదయమనే పుష్పకంలో ఎంతమంది భక్తులు వచ్చినా చోటు కల్పిస్తానని చాటేందుకు స్వామి పుష్పక వాహనంపై ఊరేగుతారు.

6వ తేదీ (మూడోరోజు)

హంసవాహనం: పరమహంస అయిన తాను మనిషిలోని జ్ఞానజ్ఞాలను వేరు చేసి, జ్ఞానాన్ని ప్రసాదిస్తానని చాటేందుకే ఈ వాహనంపై స్వామి దర్శన మిస్తారు.

శేషవాహనం: శేషుడు వాక్పటిమను కలిగినవాడు. సర్వవాక్కులకు అధినేతైన వాక్ పరబ్రహ్మను నేనే అని భక్తులకు తెలియజెప్పేందుకే స్వామి ఆదిశేషుడిపై ఊరేగుతారు.

7వ తేదీ (నాల్గవ రోజు)

పంచముఖ ఆంజనేయస్వామి: బుద్ధి, బలం, కీర్తి, ధైర్యం, నిర్భయత్వం అనే గుణాలను భక్తులకు అందించడమే ఈ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం పరమార్థం

కంచుగరుడ వాహనం: కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను జయించే శక్తిని భక్తులకు అనుగ్రహించేందుకు స్వామి ఈ వాహనంపై వెళతారు.

8వ తేదీ (ఐదో రోజు)

స్వామి వారి రథోత్సవం

9వ తేదీ (ఆరో రోజు)

గజ వాహనం: గజం బుద్ధికి సంకేతం. భక్తుడు బాగా ఆలోచించి, భక్తి, జ్ఞాన, వైరాగ్యాల వైపు భక్తులను నడిపించేందుకు స్వామి ఈ వాహనంపై ఊరేగుతారు.

పొన్న వాహనం: సర్వస్వం నీవే అన్న గోపికల ఆత్మనివేదనను స్వీకరించినట్టుగా భక్తుల ఆత్మ నివేదనను స్వీకరించేందుకే ఈ వాహనంపై స్వామి ఊరేగుతారు.

10వ తేదీ (ఏడో రోజు)

హనుమద్వాహనం: భక్తులు కూడా హనుమంతుని వలె స్వామిని తలుచుకుని పనులు నిర్విఘ్నంగా పూర్తి చేయవచ్చని చాటి చెప్పడమే ఈ వాహనం పరమార్థం

సింహవాహనం: మానవుడు, మాధవుడు కలసిన స్వరూపమే లక్ష్మీనృసింహస్వామి. అట్టి మాధవ స్వరూపం, సింహం నేనేనని స్వామి ఈ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.

11వ తేదీ (ఎనిమిదో రోజు)

రాజాధిరాజ వాహనం: రాజులకే రాజైన లక్ష్మీనరసింహస్వామి భక్తుల కోర్కెలు తీర్చడానికి ఈ వాహనాన్ని అధిరోహించి, గ్రామోత్సవానికి వెళతారు.

అశ్వ వాహనం: మనిషిలో ఉండే జ్ఞానం అశ్వం మాదిరిగా చురుకుగా ఉండాలని సూచించేందుకు స్వామి ఉత్సవాల్లో ఈ వాహనంపై దర్శనమిస్తారు.

12వ తేదీ (తొమ్మిదో రోజు)

గరుడపుష్పక వాహనంపై గ్రామోత్సవం, చక్రవారి సముద్రస్నానం

13వ తేదీ (పదవ రోజున)

పుష్పక వాహనంపై గ్రామోత్సవం, అంతర్వేది చెరువులో తెప్పోత్సవం

అంతర్వేది తీర్థంలో పటిష్టమైన ఏర్పాట్లు


అంతర్వేది ఆలయ ప్రాంగణంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో నేటి నుంచి ప్రారంభం కానున్న లక్ష్మీనరసింహస్వామితిరు కల్యాణోత్సవాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సోమవారం అంతర్వేది ఆలయం ప్రాంగణంలో ఎమ్మెల్యే మీడియా సమావేశం నిర్వహించారు. గతం కంటే మెరుగైన రీతిలో సౌకర్యాలు కల్పిస్తున్న తరుణంలో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకోవాలని కోరారు. ప్రధాన రోజుల్లో సుమారు 4 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తూ, తదనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రవాణా సౌకర్యాలు మెరుగుపర్చేందుకు ఆర్అండ్‌బీ ద్వారా రూ.22 కోట్లుతో వివిధ రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. పంచాయతీరాజ్ ద్వారా రూ.30 లక్షలతో పనులు చేపట్టామన్నారు. తీర్థంలో పారిశుద్ధ్యంలో 342 మంది కార్మికులు నిమగ్నమవుతున్నారన్నారు. 120 మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నట్టు, 60 సత్తరువులకు తాగునీటి సరఫరా చేసేందుకు అన్ని సిద్ధం చేశామన్నారు. భక్తుల భద్రతకు 20 డ్రోన్‌లు ఫ్లై చేస్తున్నట్టు, 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు, 12 ఎల్‌ఈడీ స్క్రీన్‌లు కల్యాణం వీక్షించేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే భక్తుల ఆరోగ్య పరిరక్షణకు 5 ప్రాథమిక కేంద్రాలు, 26 మంది మెడికల్ ఆఫీసర్లు విధుల్లో ఉంటారన్నారు. సమావేశంలో చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, దేవస్థానం ఏసీ వి.సత్యనారాయణ, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఐదు వేలు వాటర్ బాటిళ్ల వితరణ

అంతర్వేది తీర్థమహోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం సోమవారం సఖినేటిపల్లిలంక గ్రామానికి చెందిన పడాల రాంబాబు ఐదు వేల వాటర్ బాటిళ్లు వితరణ చేశారు. ఈ మేరకు వీటిని ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీకి ఆలయం వద్ద అందజేశారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమా?


మలికిపురంలో ఫీజు పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు


అంబాజీపేట ఫీజు పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

- మాజీ మంత్రి గొల్లపల్లి ఆగ్రహం
- మలికిపురంలో ఫీజు పోరు పోస్టర్ ఆవిష్కరణ

మలికిపురం: రాష్ట్రంలో పేద విద్యార్థులు జీవితాలను పణంగా పెట్టి కూటమి ప్రభుత్వం వారితో చెలగాటమాడుతూ అరాచకపాలన సాగిస్తుందని మాజీ మంత్రి, రాజోలు వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. ఈ నెల 5న జిల్లా కేంద్రం అమలాపురంలో జరిగే వైఎస్సార్ సీపీ ఫీజు పోరు పోస్టర్ ఆవిష్కరణలో సోమవారం మలికిపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జరిగింది. పెద్ద ఎత్తున హాజరైన పార్టీ శ్రేణుల మధ్య గొల్లపల్లి పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం వేధిస్తుందన్నారు. దీంతో అయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. దివంగత మాజీ సీఎం రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను మరింత మెరుగ్గా జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా వేధించడం దారుణమన్నారు. త్రైమాసికంగా బకాయి పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, కింద ఇవ్వాల్సిన రూ.3,900 కోట్లను తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేఎస్ఎన్ రాజు, పాటి శివకుమార్, కటకంశెట్టి ఆదిత్య, రుద్రరాజు చిన్నారాజా, జాన శంకరరావు, కుసుమ చంద్రశేఖర్, కట్టా శ్రీనివాసరావు, బొలిశెట్టి భగవాన్, ఎస్తేరు రాణి, కూనపరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులపై కూటమి కక్ష: కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

అంబాజీపేట: కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా పేద విద్యార్థులపై కక్ష సాధిస్తోందని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం కోఆర్డినేటర్, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. అంబాజీపేటలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్యక్షతన ఆయన స్వగృహం వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో పేద పిల్లలను కళాశాలల యాజమాన్యాలు ఫీజులు కట్టాలంటూ ఒత్తిడి చేస్తున్నాయని విమర్శించారు. కళాశాల విద్య పూర్తయిన విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తే గాని సర్టిఫికెట్లు ఇవ్వని దుస్థితి నెలకొందన్నారు. దీంతో తల్లిదండ్రులు అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి దేవి, నాయకులు పీకే రావు, మందపాటి కిరణ్‌కుమార్‌లు మాట్లాడుతూ సూపర్ సిక్స్ అంటూ చంద్రబాబు మరోసారి ప్రజలను మోసం చేసి గద్దెనెక్కారన్నారు, అనంతరం ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, పేరి శ్రీనివాస్, సూదాబత్తుల రాము, ఎంఎం శెట్టి, ముత్తాబత్తుల ప్రశాంత్, ఉందుర్తి నాగబాబు, కుసుమ వరలక్ష్మి, ముత్తాబత్తుల మణిరత్నం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం


అంతర్వేది బీచ్‌లో పరిశుభ్రతా కార్యక్రమం చేపట్టిన ప్రభావతి

సఖినేటిపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని ఏపీ ఎస్జీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ గుండేపల్లి ప్రభావతి అన్నారు. సోమవారం అంతర్వేది దేవస్థానం ప్రాంగణంలోను, అంతర్వేది బీచ్‌లోను ప్రభావతి ఆధ్వర్యంలో శుభ్రం చేసే కార్యక్రమాలను విద్యార్థులు, ప్రజాప్రతినిధులు చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ఆరోగ్యాన్ని కాపడుకుందాం, ప్లాస్టిక్‌ని నిషేధిద్దాం, భావి తరాలను కాపాడుకుందాం అంటూ ఆయా ప్రాంతాల్లో ర్యాలీ చేశారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ భైరా నాగరాజు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, హెచ్ఎంలు ప్రసాద్, మలికార్జునరావు, సెంట్ మేరీస్ విద్యార్థులు, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఫాదర్ మరియా జేసురాజ్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి


తొండవరంలో స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

అంబాజీపేట: పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చని హెచ్ఎం పీవీ కేశవాచార్యులు అన్నారు. తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో ఎస్టీయూ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ 20 మంది విద్యార్థులకు ఎస్టీయూ సంఘ సభ్యులు గాది శ్రీనివాసరావు, ఆదుర్తి వెంకట అప్పారావు, గంటి శ్రీనివాస్, పినిపే సత్యనారాయణ, కందాల గణేష్‌నరసింహారావు, వలవల శ్రీబాలాజీలు ఉచితంగా అందజేశారన్నారు. దాతలు ఇచ్చిన సహకారంతో విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు మానుకొండ చంద్రరావు పాల్గొన్నారు.

మోడల్ కోడ్‌ను విధిగా పాటించాలి

అంబాజీపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మోడల్ కోడ్‌ను రాజకీయ పార్టీలు విధిగా పాటించాలని ఎంపీడీఓ జీవీ సరోవర్ అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మోడల్ కోడ్‌ను అమలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే సూచించామన్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా రాజకీయ ఫ్లెక్సీలు ఉండకూడదన్నారు. అలాగే రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించామన్నారు. కోడ్ వచ్చిన నాలుగు రోజులకు పంచాయతీ అధికారులు సోమవారం రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు.

వినియోగదారుల సంఘాలు బలోపేతం కావాలి


కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతున్న సీఏసీ చైర్మన్ కృష్ణారెడ్డి

కొత్తపేట: మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వినియోగదారుల సంఘాలు, సమాఖ్యలు బలోపేతం కావాలని జాతీయ కన్స్యూమర్ ఎఫైర్స్ కమిటీ (సీఏసీ) చైర్మన్ మందడి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి కృష్ణారెడ్డి కొత్తపేటలో రాష్ట్ర వినియోగదారుల జేఏసీ మెంబర్ సత్తిరాజు ఆదిత్య కిరణ్ స్వగృహానికి విచ్చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పరిధిలో కన్స్యూమర్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్‌గా రాష్ట్రాల్లో వినియోదారుల చైతన్యం, హక్కుల పరిరక్షణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలు, సలహాలు, వినియోగదారుల అవగాహన కార్యక్రమాలకు అవసరమైన నిధులు సమకూరుస్తామన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాల్సి ఉందన్నారు. 1986లో వినియోగదారుల హక్కుల కోసం కన్స్యూమర్ కోర్టులు ఆవిర్భవించినట్టు తెలిపారు. 2019 నుంచి ఈ యాక్టులో సమూల మార్పులు వచ్చాయన్నారు. అనాథలు, వృద్ధుల కోసం ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌ను నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ ఫౌండర్, మేనేజింగ్ ట్రస్టీ కృష్ణారెడ్డి తెలిపారు. దేశంలోని 27 రాష్ట్రాల్లో 33 అనాథ, వృద్ధాశ్రమాలు నిర్వహిస్తున్నట్టు, మొత్తం సుమారు పదివేల మంది ఆయా ఆశ్రమాల్లో జీవనం సాగిస్తున్నారన్నారు. ఏపీలో 7, తెలంగాణలో 3 ఆశ్రమాలు ఉన్నాయన్నారు. 50 ఏళ్ల పైబడి ఒంటరిగా ఉన్న పెద్దలకు హైదరాబాద్ దోమలగూడ ఏవీ కాలేజీలో ప్రతినెల మూడో ఆదివారం పెద్దల స్వయవరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒంటరితనం నుంచి బయటపడి తోడుగా జీవించడానికి ఇది దోహదపడుతుందన్నారు. సమావేశంలో ఎల్డర్స్ క్లబ్ సభ్యుడు ఎస్.భూపాల్‌రెడ్డి, కోనసీమ ఉమెన్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ చీఫ్ ఫంక్షనరీ సత్తిరాజు ఉషారాణి, మండల వినియోగదారుల వలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులు గమిడి శ్రీనివాస్, శ్రీకాకుళపు భీమేశ్వరరావు, మట్ట బాలు, వాడపల్లి సత్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో పుస్తెల తాడు అపహరణ

మామిడికుదురు: వాకింగ్ చేస్తున్న మహిళ మెడలో పుస్తెల తాడును అపహరించిన సంఘటన సోమవారం సాయంత్రం నగరం గ్రామంలో జరిగింది. యూనియన్ బ్యాంకు పక్క సందులోని పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో వాకింగ్ చేస్తున్న ముత్యాల విజయ కనకదుర్గ గంగాభవాని మెడలోని పుస్తెల తాడును స్కూటీపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు లాక్కునిపోయారు. 21 గ్రాముల పుస్తెల తాడును దొంగలు లాక్కుని పోయారని బాధితురాలు నగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

అయినవిల్లి: మండలంలోని నేదునూరులో రామలయం మూడో వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పెదపూడి గోపాలచార్యుల ఆధ్వర్యంలో రాములు వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ నిర్వాహకుడు ఎంపీటీసీ–2 సభ్యుడు ఇండుగుల వెంకట్రామయ్య అధ్వర్యంలో ఈ పూజలు జరిపారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. అలాగే నూతనంగా నిర్మించిన కల్యాణమండపాన్ని ప్రారంభించారు.

సామూహిక అక్షరాభ్యాసం


సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారుల తల్లిదండ్రులు

రావులపాలెం: స్థానిక సత్య సాయిబాబా మందిరంలో సోమవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. సమీప ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రులు వారు చెన్నారులతో ఈ పూజల్లో పాల్గొన్నారు. పెదసనగంటి సీతారామమూర్తిశర్మ అవధాని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

అంబాజీపేట: స్థానిక పే బ్యాక్ టు సొసైటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జీవిత చరిత్రలపై సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆర్గనైజేషన్ సభ్యులు మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని మండలంలోని విద్యార్థులకు పోటీలు నిర్వహించామన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఈ ఏడాది ఏప్రిల్ 11న బహుమతులు అందజేస్తామన్నారు.

సిమెంట్ రోడ్ల నాణ్యత పరిశీలన


నవాబుపేటలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజు తదితరులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు నిర్మాణాల నాణ్యతా ప్రమాణాలను సోమవారం ఎంపీడీఓ ఎ.రాజు పరిశీలించారు. మండలంలోని ఉపాధిహామీ పథకం కింద రూ.2.47 కోట్లతో 11 గ్రామాల్లో జరుగుతున్న 17 రహదారుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. పనుల నాణ్యతను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు సలహాలను అందజేశారు. అలాగే మండలంలో అపరిష్కృతంగా ఉన్న ప్రభుత్వ భవనాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీఓ రాజు పేర్కొన్నారు. ఏపీఓ జి.అరుణకుమారి, ఇంజినీరింగ్ జేఈ డి.వీరభద్రరావు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గ్రామీణ మహిళల్లో రాజకీయ ఆసక్తి


సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

రాజోలు: గ్రామీణ ప్రాంత మహిళల్లో రాజకీయ ఆసక్తి పెరిగిందని పంచాయతీరాజ్ వ్యవస్థలో జరిగిన ఎన్నికలు రుజువు చేస్తున్నాయని బెంగళూరు జాతీయ న్యాయ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ సంగిట సత్యనారాయణ అన్నారు. సోమవారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఎన్నిక కాబడిన మహిళా ప్రజాప్రతినిధుల పాత్ర–గ్రామ పంచాయతీల ప్రాతినిధ్యం' అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసి అనేక మంది మహిళలకు విజయాన్ని సొంతం చేసుకున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలు ఎన్నికల్లో ప్రాతినిధ్యం వహించేందుకు ముందుకు వస్తున్నారన్నారు. డ్వాక్రా సంఘాల ఏర్పాటు ద్వారా మహిళల్లో ఆర్థిక, సామాజిక చైతన్యం వచ్చిందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు, డాక్టర్ బోసు, పీఆర్వో నల్లి రాజు, ఆశ్వని, దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుని సంబరం

అయినవిల్లి: మడుపల్లిలో వీరభద్రుని సంబరం వైభవంగా జరిపారు. దేవుడమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరభద్రునికి గ్రామోత్సవం జరిపారు. అలాగే భారీ ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అలాగే అయినవిల్లిలో కూడా వీరభద్రుని సంబరం వైభవంగా జరిపారు.